క్లుప్తంగా

అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన దీప్తి ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్స్‌లోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. గోవర్ధనగిరి గ్రామానికి చెందిన దీప్తి ప్రసవ వేదనతో ఉన్న సమాచారం వీపనగండ్ల 108 సి బ్బందికి అందించడంతో ఆమెను ఆస్పత్రికి త రలిస్తుండగా మార్గ మధ్యలో ప్రసవం కావడంతో తల్లీకూతురు ఆరోగ్యంగా ఉన్నారు. వారి కుటుంబ సభ్యులు అంబులెన్స్ పైలెట్ శివ య్య, టెక్నిషియన్ సాయికుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం అల్వాల గ్రామానికి చెందిన ఆంజనేయులు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అతని స్నేహితులు (పదో తరగతి బ్యాచ్) వాట్సాప్ గ్రూప్ ద్వారా కేవలం గంటల వ్యవధిలోనే రూ.45 వేలు సేకరించి, చిన్నమందడి గ్రామానికి చెందిన నందనమోని గోవర్ధన్‌కు ఫోన్‌పే ద్వారా పంపించారు. అనంతరం శుక్రవారం అల్వాల గ్రామంలో అంత్యక్రియలకు హాజరయ్యారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.45వేలు అందజేశారు.

బాధితులకు పరామర్శ



కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన రాష్ట్ర ఫిలింసెన్సార్ బోర్డు సభ్యులు పబ్బా నరేందర్‌గౌడ్ ఇటీవల అనారోగ్యం వల్ల హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అనంతరం ఇంటికి రావడంతో ఆయనను కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు ఏజే బోయేజ్, పి.కృష్ణారెడ్డి, ఎల్లంపల్లి నరేందర్, జేఎం మీషేక్, వెంకటేశ్వర్‌రెడ్డి, జె.సుభాష్, భాస్కర్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై హర్షం



గోపాల్‌పేట: ప్రధాన మంత్రి ఎప్పుడూ పేదల కష్టాలు చూస్తారని గోపాల్‌పేట బీజేపీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. పేద, మధ్య తరగతి వారి కష్టాలు గుర్తిస్తూ ప్రధాని జీఎస్టీ తగ్గించడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మణివర్ధన్‌సాగర్, మండల మాజీ అధ్యక్షుడు అరవింద్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్‌మెంబర్ మల్లికార్జున్, మండల జనరల్ సెక్రటరీ శివ, వామన్‌గౌడ్, అశోక్‌రెడ్డి ఉన్నారు.

ప్రతి కార్యకర్త శ్రమించాలి



వనపర్తి రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త శ్రమించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ సూచించారు. శుక్రవారం శ్రీ రంగాపురం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో శేరుపల్లి, నాగరాల ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాముయాదవ్, లక్ష్మీనారాయణ, మోహన్‌రాజు, రాజు, శివ, ఎల్లస్వామి, నరేష్‌యాదవ్, రాజేష్ పాల్గొన్నారు.

కొత్తకోట పట్టణ గౌడ సంఘం ఎన్నిక

కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణ గౌడ సంఘం కమిటీ ఎన్నిక శుక్రవారం పట్టణంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గండు వెంకటన్నగౌడ్, గౌరవ అధ్యక్షుడిగా ఎం.జనార్దన్‌గౌడ్, జి.తిరుపతయ్యగౌడ్, ఉపాధ్యక్షులుగా ఆవుల రాఘవేంద్రగౌడ్, బి.కృష్ణయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా గండు రవీందర్‌గౌడ్, కార్యదర్శిగా ఎం.నరేష్‌గౌడ్, సహాయ కార్యదర్శిగా గుకొండ రఘుగౌడ్, కోశాధికారిగా రాచాల హరికృష్ణగౌడ్, ప్రచార కార్యదర్శిగా అక్కల రఘునాథ్‌గౌడ్, కార్యదర్శులుగా దేవిగౌడ్, జి.వెంకటేష్‌గౌడ్, చిన్ననారాయణగౌడ్, శివశంకర్‌గౌడ్, సుక్క నరేష్‌గౌడ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.



వనపర్తి పట్టణంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడి ముందు బొడ్డెమ్మ వేస్తున్న మహిళలు



ఖిల్లాఘనపురం భరత్‌నగర్ కాలనీలో గణనాథుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న కాలనీ యువకులు

గంగమ్మ ఒడికి.. గణనాథులు

వనపర్తి టౌన్/ఖిల్లాఘనపురం: వనపర్తి పట్టణంలో, ఖిల్లాఘనపురం మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం గణనాథుల నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పలుగ్రామాల్లో ఉదయం నుంచి స్వామి వారి మండపాల దగ్గర అన్నదానం ఏర్పాటు చేశారు. ఖిల్లాఘనపురం భరత్‌నగర్ కాలనీ, అప్పారెడ్డిపల్లిలోని భర్తగేరిలో ఏర్పా టు చేసిన గణనాథుల దగ్గర కాలనీవాసులు ప్రత్యేక వంటలు చేసి స్వా మి వారికి నైవేద్యంగా పెట్టారు. లడ్డువేలం నిర్వహించి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

ప్రవక్త జీవితం శాంతి సందేశం



ఆత్మకూర్‌లో రోగులకు పండ్లు ఇస్తున్న ముస్లింలు



కల్వరాలలో ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ముస్లింలు

ఆత్మకూర్: ముస్లింల ఆరాధ్య దైవం మహ్మద్ రసూల్లహ్ సల్లలాహు వలైవసల్లం (ప్రవక్త) జయంతి వేడుకలు శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు మసీద్‌లో జాగారం చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రవక్త పుట్టిన అనంతరం మానవాళి కోసం చేసిన త్యాగాలను స్మరించుకున్నారు, ప్రవక్త జీవితం శాంతి సందేశమని ప్రముఖ మౌలానాలు తెలిపారు. ప్రపంచ శాంతికోసం ప్రార్థనలు నిర్వహించిన అనంతరం మసీదులలో అన్నదానం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మక్తల్ ఎమ్మెల్యే, మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి, గీత కార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, మార్కెట్ చైర్మన్ రహ్మతుల్లా, మాజీ ఎంపీపీలు శ్రీధర్‌గౌడ్, బంగారు శ్రీనివాసులు, మాజీ చైర్ పర్సన్ గాయత్రి, అధికారులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని ముస్లింలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కల్వరాల, వీపనగండ్ల, తూముకుంట తదితర గ్రామాలలో మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సర్దార్, గఫార్, రజాక్, సెమి, అక్బర్ పాల్గొన్నారు.

విద్యార్థులను జ్ఞానంవైపు నడిపించాలి



ఆత్మకూర్‌లో అధ్యాపకుల సన్మానం

వనపర్తిటౌన్: ఉపాధ్యాయులు విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా పని చేయడమే సర్వేపల్లి రాధాకృష్ణకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర కన్వీనర్ రాజారామ్‌ప్రకాశ్‌కు ఫోన్ చేసిన ప్రొఫెసర్ కొదండరాం సన్మాన సభను ఉద్దేశించి మాట్లాడారు.. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి సత్యానారాయణ యాదవ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పాన్‌గల్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలో ఉత్తమ సేవలు అందించిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడారు. అంతకుముందు డా.సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



పాన్‌గల్‌లో హెచ్‌ఎం, ఉపాధ్యాయులను సన్మానించిన ఎంఈఓ శ్రీనివాసులు

విద్యార్థుల మార్గదర్శి ఉపాధ్యాయుడు

ఖిల్లాఘనపురం: పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను మంచి మార్గంలో నడిపించి వారి భవిష్యత్‌కు బాటలు వేసే మార్గదర్శి గురువులని ఖిల్లాఘనపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్ అన్నారు. అధ్యాపక వృత్తిలో 16ఏళ్లుగా ఉంటూ అర్థశాస్త్రంలో విద్యార్థులకు మెలుకువలు అందిస్తున్న సంతోష్‌రాజ్‌ను ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

ఆత్మకూర్: ఆత్మకూర్‌లోని శ్రీవాణి హైస్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని చత్రపతి వాకింగ్ గ్రూప్ సభ్యులైన జాజుల శ్రీనివాసులు, వేణు, పరుశరాం ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వాకింగ్ గ్రూప్ అధ్యక్షుడు స్టార్ ఆంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో లాల్కోట రవి, రాజుయాదవ్, రవీందర్‌గౌడ్, నగేష్, నాగరాజు, దస్తగిరి, యాదగిరి ఉన్నారు.



ఖిల్లాఘనపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న చత్రపతి వాకింగ్ గ్రూప్ సభ్యులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో శుక్రవారం ఆర్బి డిపాజిటర్స్ సెమినార్ కార్యక్రమం ద్వారా ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన క ల్పించారు. ఈ సందర్భంగా నారాయణ కళాజాతా బృందం ఆటపాటలతో బ్యాంకులలో ఆర్థిక లావాదేవీల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించా రు. నేటి సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కళాకారులు ప్రజలకు వి వరించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ శేఖర్‌రెడ్డి, మస్తానయ్య, పలువురు పాల్గొన్నారు.

తొలగించిన జెండాలు పెట్టాలని నిరసన

ఆత్మకూర్: ఆత్మకూర్‌లో పోలీసులు తొలగించిన జెండాలను ఏర్పాటు చేయాలని ఓ వర్గానికి చెందిన వారు నిరసన చేపట్టారు. శుక్రవారం స్థానిక గాంధీచౌక్‌లో ఓ వర్గానికి చెందిన వారు చేరుకుని రాస్తారోకో నిర్వహించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ కలుగజేసుకొని జెండాలను ఏర్పాటు చేయడంతో సమస్య సద్దుమనిగింది.

నేడు అనంత పద్మనాభ స్వామి వ్రతం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అనంత పద్మనాభ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అమరుల ప్రాణత్యాగమే నేటి ఫలితాలు



రేమద్దులలో మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

పాన్‌గల్: అమరుల ప్రాణత్యాగం వల్లనే తెలంగాణ రైతాంగ పోరాట ఫలితాలను ప్రజలు ఇప్పుడు అనుభవిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ.జబ్బార్ అన్నారు. శుక్రవారం పాన్‌గల్ మండలం రేమద్దులలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరుల సంస్మరణ సభలో అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి, కుల వివక్షత, అంటరానితనానికి వ్యతిరేకంగా దున్నేవాడికి భూమి, పండించిన పంటలపై రైతులకు అధికారం ఉండటమే సాయుధ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్ర అన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, వెంకటయ్య, భగత్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



వనపర్తి పట్టణంలో వార్డులో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

వనపర్తి రూరల్: పట్టణంలోని 18 వార్డులో ప్రజల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారితో ఆయన సర్వే నిర్వహించారు. కాలనీలో మిషన్ భగీరథ పైపులైన్లకు రోడ్డు తవ్వి సరిగా వేయక పోవడంతో అస్తవ్యస్తంగా తయారైనట్లు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జి మదన్, రత్నయ్య, రాబర్ట్, రాములు, నరసింహ, వెంకటయ్య పాల్గొన్నారు.

బస్సు పునరుద్ధరించాలని డీఎంకు వినతి



ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వీపనగండ్ల: కొల్లాపూర్ డిపో నుంచి బొల్లారం, కొర్లకుంట గ్రామాల మీదుగా గతంలో నడుస్తున్న ఆర్టీసీ బస్సును తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం బొల్లారం గ్రామ సీపీఎం నాయకులు శుక్రవారం కొల్లాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఉమాశంకర్‌గౌడ్‌కు ఒక వినతిపత్రం అందజేశారు. గతంలో ఎన్నోమార్లు బస్సును పునరుద్ధరించాలని కోరామని, అధికారులు స్పందించక పోవడంతో బొల్లారం గ్రామంతో పాటు పలు గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బాలగౌడ్, బి కృష్ణయ్య, వెంకటస్వామి, తిరుపతయ్య, రంగస్వామి, శ్రీనివాసులు, సుబ్బన్న, మహేష్, భాస్కర్‌లు తెలిపారు.

బెస్ట్ న్యూమరాలజిస్ట్ గా విశ్వాంక్‌సేన్



అమరచింత: పట్టణంలోని కొత్త తండాకు చెందిన న్యూమరాలజిస్ట్ విశ్వాంక్‌సేన్‌ను (ఎల్‌వీ. రమేష్ నాయక్) బెస్ట్ న్యూమరాలజిస్ట్‌గా మనం ఫౌండేషన్ వారు ఎంపిక చేశారు. ఈ మేరకు ఈనెల 7న హైదరాబాద్‌లోని కళాభారతి సిటి కల్చరల్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో సన్మానించనున్నట్లు విశ్వాంక్ సేన్ వెల్లడించారు.

పోయిన డబ్బులు 5 రోజుల్లో అకౌంట్లో జమ

మక్తల్: పట్టణానికి చెందిన ఎండీ పజ్లార్ రహిమాన్ ఇటీవల సైబర్ మోసానికి గురై రూ.లక్షకు పైగా నగదు పోగొట్టుకున్నాడు. అయితే పోయిన నగదు తిరిగి ఐదు రోజుల్లో జమ అయింది. వివరాల్లోకి వెళ్తే రహిమాన్‌కు వాట్సాప్‌లో ఆర్‌టీఓ చలాన్ పేరిటా ఓ మెసేజ్ వచ్చింది. మెసేజ్‌పై క్లిక్ చేయడంతో ఈనెల 1న రూ.1.30 లక్షలు డెబిట్ అయ్యాయి. వెంటనే అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు 1930కి ఫోన్ చేసి సమాచారం అందించారు. ఈ క్రమంలో పోగొట్టుకున్న డబ్బులు శుక్రవారం బాధితుడి ఖాతాల్లో జమ అయినట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. పోయిన డబ్బులు తిరిగి రావడంతో బాధితుడు ఆనందంతో పోలీస్ స్టేషన్‌కు వాల్ క్లాక్ అందజేశాడు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయొద్దని పోలీసులు సూచించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

యూరియా కోసం రైతుల ఆందోళన

- దేవరకద్రలో గంటపాటు రాస్తారోకో
- పెద్ద ఎత్తున నిలిచిన వాహనాలు



దేవరకద్రలో దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

దేవరకద్ర: దేవరకద్రలో యూరియా కోసం మరోసారి రైతులు రోడ్డెక్కారు. శుక్రవారం ఉదయం వివిధ గ్రామాల నుంచి రైతులు దేవరకద్రకు చేరుకొని ఉదయం 7గంటల నుంచి పట్టణంలోని షాపులన్నీ తిరిగి ఎక్కడా యూరియా ఇచ్చే పరిస్థితి కనిపించక పోవడంతో ఆందోళనకు దిగారు. కొత్తబస్టాండ్ సమీపంలోని రాయిచూర్ రోడ్డుపైకి వందలాది మంది రైతులు చేరుకుని రాస్తారోకో చేశారు. దాదాపు గంటసేపు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఉదయం 9గంటల వరకు రాస్తారోకో కొనసాగింది. దీంతో రాయచూర్- మహబూబ్‌నగర్ రోడ్డులో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ఎస్‌ఐ నాగన్న రైతులతో చర్చించి అధికారులతో మాట్లాడిస్తానని నచ్చచెప్పి రాస్తారోకోను విరమింపజేశారు.

ఫోన్ చేసినా స్పందించని అధికారులు

రాస్తారోకోను విరమించిన తర్వాత ఎస్‌ఐ నాగన్న రైతులతో వ్యవసాయ అధికారికి ఫోన్ చేయించారు. అయితే వ్యవసాయ అధికారి ఫోన్‌లో స్పందించపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల కోసం ఎదురుచూసిన రైతులు చేసేది లేక నిరాశతో వెనుదిరిగి పోయారు.

డీసీసీబీలో అవినీతిపై విచారణ చేపట్టాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఉమ్మడి జిల్లా డీసీసీబీలో అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీసీబీలో కొందరు పనిగట్టుకొని అవినీతికి పాల్పడుతున్నారని, కొందరు ఉన్నతాధికారులు సొంత నిర్ణయాలతో ఉద్యోగులను వేధిస్తుండడం, పేస్కేల్ లేని ఉద్యోగులను బదిలీ చేస్తామంటూ బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. అక్రమాలపై విచారణ జరపకుంటే పోరాటాలు చేస్తామన్నారు. 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరుగనున్న సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో సాయుధ పోరాట అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు నరేందర్‌రెడ్డి, బాలకిషన్, సురేశ్, రాము, గోవర్ధన్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

నల్లబారుతున్న మామిడి పూత



మామిడి తోటలో ముందస్తు పూత

- మామిడి తోటల్లో ముందస్తు పూతలు
- భారీ వర్షాలకు రైతుల ఆందోళన
- పూతను కాపాడేందుకు ప్రైవేట్ మందుల ఏజెన్సీలపై మొగ్గు
- క్షేత్రస్థాయిలో ఉద్యానశాఖ అధికారులు పర్యటించాలని వేడుకోలు

వీపనగండ్ల: జిల్లాలో మామిడి తోటల సాగులో వీపనగండ్ల మండలం మొదటి స్థానంలో ఉంది. వేలాది ఎకరాలలో మామిడి తోటలు సాగు చేస్తున్న రైతుల తోటలలో ముందస్తు పూతలు రావడం, వచ్చిన పూతలు తెగుళ్ల బారిన పడడంతో ఎలాంటి మందులు వాడాలన్న సందిగ్ధ పరిస్థితుల్లో మామిడి రైతులు ఉన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి క్షేత్రస్థాయిలో తోటలు పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

4800 ఎకరాలలో మామిడి సాగు..

మండలంలోని వివిధ గ్రామాలలో 2064 మంది రైతులు, 4801 ఎకరాలలో మామిడి తోటలు సాగు చేశారు. బొల్లారంలో 183 మంది రైతులు 404 ఎకరాలు, కొర్లకుంటలో 90 మంది 182 ఎకరాలు, వల్లభాపురంలో 39 మంది, 65 ఎకరాలు, గోపల్‌దిన్నెలో 162 మంది 386 ఎకరాలు, గోవర్ధనగిరిలో 385 మంది 837 ఎకరాలు, కల్వరాలలో 128 మంది 338 ఎకరాలలు, పుల్గర్ చర్లలో 88 మంది 192 ఎకరాలు, సంగినేనిపల్లిలో 160 మంది 347 ఎకరాలు, సంపత్‌రావుపల్లిలో 79 మంది 243 ఎకరాలు, తూముకుంటలో 236 మంది 602 ఎకరాలు, వీపనగండ్లలో 514 మంది రైతులు 1201 ఎకరాలలో మామిడి తోటలు సాగు చేశారు.



తెగుళ్ల బారిన మామిడి తోటలు

పూత, చిగురుతో అయోమయం

మామిడి తోటలు సాగు అవుతున్న అన్ని గ్రామాలలో తోటలలో ముందస్తుగా పూతలు రావడంతో పాటు చిగురులు వస్తుండడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఒకసారి పూతలు వస్తే భారీ వర్షాలకు పూతలు రాలుతున్నాయి. మళ్లీ పూతలు వస్తాయా! రావా? అన్న సందిగ్ధంలో రైతులున్నారు. వచ్చిన పూతలకు వెంటనే చీడపీడలు సోకడం, పూతలు నల్లబారుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

మందుల వాడకంపై అవగాహన లేక..

మామిడి తోటలకు ఎలాంటి మందులు వాడాలన్న అవగాహన లేకపోవడంతో ప్రైవేటు మందుల ఏజెన్సీలను ఆశ్రయిస్తున్నారు. మామిడి తోటల తొలినాళ్లలో వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.


రెట్టింపు మందులు వాడాల్సి వస్తోంది..



ముందస్తు పూతలు, చిగుళ్లతో రెట్టింపు మందులు వాడాల్సి వస్తోంది. ఏ మందులు వాడితే పూతలు నిలుస్తాయన్న ఆందోళనలో అధిక డబ్బులు ఖర్చు అవుతున్నాయి. భారీ వర్షాలతో మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితులు నెలకొంటున్నాయి.

– శనమోని గంగయ్య, మామిడి రైతు, వీపనగండ్ల

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి



జిల్లా. రాష్ట్ర స్థాయి ఉద్యానశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో మామిడి తోటలను సందర్శించాలి. రైతులతో అవగాహన సదస్సును ఏర్పాటు చేసి పూతల దశ నుంచి కాయలు కోసే దశ వరకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలి. మామిడి రైతులు నష్టపోకుండా ఉండాలంటే మద్దతు ధరను ప్రకటించాలి.

– బాలస్వామి, మామిడి రైతు, వీపనగండ్ల

పూతలు రాలిన మళ్లీవస్తాయి..



మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల కొందరి రైతుల తోటలలో ముందస్తు పూతలు వచ్చిన మాట వాస్తవమే. ముందస్తుగా వచ్చిన పూతలు రాలిపోయినా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పూతలు వచ్చినా పక్క కొమ్మలకు మళ్లీ పూతలు వస్తాయి. ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి అవసరమైన మేరకే మందులు వాడాలి.

– కృష్ణ, ఉద్యావన శాఖ అధికారి, వీపనగండ్ల